సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



రుణమాఫీ.. అక్కచెల్లెమ్మల హ్యాపీ

అక్కచెల్లెమ్మల డ్వాక్రా రుణాలను 'వైఎస్సార్ ఆసరా పథకం' ద్వారా నాలుగు విడతల్లో మాఫీ చేయడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 8లో



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
41.4°/22.6°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడే 'పది' ఫలితాలు

- సోమవారం ఉదయం 11 గంటలకు ఫలితాల విడుదల
- విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో టెన్షన్ టెన్షన్
- జిల్లాలో పరీక్షలు రాసిన 27,555 మంది విద్యార్థులు

పుట్టపర్తి: పదో తరగతి వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థుల భవితవ్యం సోమవారం తేలనుంది. ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ప్రకటించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో టెన్షన్ నెలకొంది. ప్రతి విద్యార్థి జీవితానికి టర్నింగ్ పాయింట్‌లా భావించే పదో తరగతి చాలా కీలకం. పదో తరగతిలో చూపిన ప్రతిభ విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు, ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ఈ ఏడాది మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 115 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 27,555 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన అనంతరం ఏప్రిల్ 1 నుంచి 8 వరకు జవాబుపత్రాల మూల్యాంకనం జరిగింది. సోమవారం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనుండగా, ఆ వెంటనే https:/ bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చునని డీఈఓ మీనాక్షి తెలిపారు.

అన్ని స్థానాల్లో విజయం సాధిస్తాం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్
- పార్టీ అభ్యర్థులకు బీఫాంల అందజేత



పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మకు బీఫాంను అందజేస్తున్న నవీన్‌నిశ్చల్, వలివేటి రాజారెడ్డి తదితరులు

హిందూపురం: వైఎస్ జగన్ జనరంజక పాలనతో జనమంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలుస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తప్పకుండా జిల్లాలోని పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ అఖండ విజయం సాధిస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీఫాంలు అందజేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు బి.నవీన్‌నిశ్చల్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు వలివేటి రాజారెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు తుకారాం తదితరులు తొలుత పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మకు బీ ఫారాన్ని అందజేశారు. అనంతరం హిందూపురం అభ్యర్థి టీఎన్ దీపిక, మడకశిర నియోజకవర్గ అభ్యర్థి ఈరలక్కప్పతో పాటు మిగతా అభ్యర్థులకు బీఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ... సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలకే వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంత రెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, చంటి, కట్ల బాషా, నవీన్, ఫజుల్ రెహమాన్, కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు సల్మాన్ ఖాన్, ప్రమోద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

24న పుట్టపర్తికి కేరళ గవర్నర్

పుట్టపర్తి అర్బన్: కేరళ గవర్నర్ అరీఫ్ మహమ్మద్ ఖాన్ ఈ నెల 24న పుట్టపర్తికి విచ్చేస్తున్నారు. ప్రశాంతి నిలయంలో నిర్వహించనున్న సత్యసాయి బాబా ఆరాధనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. 23వ తేదీ రాత్రి పుట్టపర్తిలోని శాంతిభవన్ చేరుకోనున్న ఆయన 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఆరాధనోత్సవాల్లో పాల్గొంటారని డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. సాయంత్రం 4 గంటలకు శాంతి భవన్ అతిథి గృహం నుంచి ప్రత్యేక కారులో బెంగళూరు విమానాశ్రయానికి వెళ్తారని వెల్లడించారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో ఇద్దరికి చోటు

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో ఇద్దరు జిల్లా వాసులకు చోటు దక్కింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా డుంగావత్ లక్ష్మీ నాయక్, వైఎస్సార్‌టీయూసీ జనరల్ సెక్రెటరీగా షేక్ అమీర్ బాషాను నియమించారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

తమ్ముళ్ల ఆగ్రహ జ్వాల

- మడకశిర అభ్యర్థి మార్పుపై అసంతృప్తి
- స్థానికేతరుడు ఎంఎస్‌రాజుకు టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతున్న కేడర్
- నమ్మించి ద్రోహం చేశారని చంద్రబాబుపై భగ్గు
- గుడిబండలో పార్టీ ముఖ్యనేతలతో ఈరన్న, సునీల్ సమావేశం
- టీడీపీ రెబల్‌గా పోటీ చేయాలని కార్యకర్తల ఒత్తిడి



మడకశిర టీడీపీ కార్యాలయం ఎదుట పార్టీ ఫ్లెక్సీలకు నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న తెలుగు తమ్ముళ్లు

మడకశిర: ఇన్నాళ్లూ జై కొట్టిన మడకశిర తెలుగు తమ్ముళ్లు...ఇప్పుడు అధినేత చంద్రబాబుకు చెప్పు చూపుతున్నారు. దళితులను నమ్మించి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'నిన్ను చెప్పుతో కొట్టినా తప్పులేదు బాబూ' అంటూ ఆదివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. టీడీపీ ఓటమే ధ్యేయంగా పనిచేస్తామని, తమ సత్తా ఏమిటో చూపుతామంటున్నారు.

రోజుకో మలుపు..

మడకశిర టీడీపీ టికెట్ కేటాయింపు రోజుకో మలుపు తిరిగి చివరకు బీఫాం మాత్రం స్థానికేతరుడు ఎంఎస్ రాజుకు దక్కింది. తానేంటో చూపుతానంటూ చెప్పిన గుండుమల తిప్పేస్వామి తన మాట నెగ్గించుకున్నారు. టీడీపీ అభ్యర్థిగా చంద్రబాబే ప్రకటించగా, నెలరోజుల పాటు ప్రచారం చేసి చివరకు నామినేషన్ కూడా వేసిన మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు సునీల్‌కుమార్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఆది నుంచీ వర్గపోరే..

మడకశిరలో ఈరన్న, గుండుమల తిప్పేస్వామి వర్గాల మధ్య రెండున్నరేళ్లుగా వర్గపోరు నడుస్తోంది. సోషల్ మీడియా వేదికగా అనుచరులూ చెలరేగిపోవడంతో ఈ రెండు వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో టికెట్ కోసం రెండు వర్గాలూ గట్టిగానే ప్రయత్నాలు చేశాయి. చివరకు ఫిబ్రవరి 24న మడకశిర టికెట్‌ను సునీల్‌కుమార్‌కు కేటాయిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అదేరోజు గుండుమల వర్గం ఆందోళనకు దిగింది. అధిష్టానం ఆదేశాల మేరకు ఈరన్న కుమారుడు సునీల్ నియోజకవర్గంలో ప్రచారం చేశారు. దాదాపు నియోజకవర్గమంతా చుట్టేశారు. మడకశిరలో మోటార్‌బైక్ ర్యాలీ, నారా లోకేశ్ సభలు నిర్వహించారు. పెనుకొండలో జరిగిన చంద్రబాబు సభకు జనసమీకరణ చేశారు. అయినా అధిష్టానం ఆయన్ను చివరి నిమిషంలో పక్కన పెట్టడం గమనార్హం.

చంద్రబాబు ఫ్లెక్సీలను చెప్పుతో కొట్టిన కార్యకర్తలు..

తాజాగా ఆదివారం మడకశిర అసెంబ్లీ టీడీపీ బీఫాంను ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజుకు కేటాయించారు. ఈ చర్యను మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం జీర్ణించుకోలేకపోయింది. మడకశిరలోని పార్టీ కార్యాలయం వద్ద వారంతా ఆందోళనకు దిగారు. పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు, బ్యానర్లను దహనం చేశారు. చంద్రబాబు ఫ్లెక్సీని చెప్పులతో కొట్టారు. చంద్రబాబుతో పాటు నారా లోకేశ్‌ను బూతులు తిట్టారు. ఎంఎస్ రాజు గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు.

లోకల్ వర్సెస్ నాన్ లోకల్..

టీడీపీలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో లోకల్..నాన్ లోకల్ అంశం తెరపైకి వచ్చింది. శింగనమలకు చెందిన ఎంఎస్ రాజుకు మడకశిర టికెట్ కేటాయించడాన్ని కార్యకర్తలు అంగీకరించడం లేదు. మడకశిర టికెట్ కోసం 18 మంది స్థానిక దళిత నాయకులు దరఖాస్తు చేసుకున్నా... వారికి కాదని స్థానికేతరుడికి టికెట్ కేటాయించడాన్ని కేడర్ వ్యతిరేకిస్తోంది. సునీల్‌ను నమ్మించి మోసం చేసిన చంద్రబాబుపై దళితుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

టీడీపీ ఫ్లెక్సీలు, జెండాల దహనం..

అమరాపురం: మడకశిర టీడీపీ అభ్యర్థి మార్పుపై ఈరన్న వర్గం భగ్గుమంది. అమరాపురం బస్టాండులో ఆదివారం చంద్రబాబు, నారా లోకేష్‌ల ఫ్లెక్సీలు, టీడీపీ జెండాలను కార్యకర్తలు దహనం చేశారు. చంద్రబాబు, నారా లోకేష్ డౌన్... డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎంఎస్ రాజు గో బ్యాక్ అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్‌కుమార్‌ను టీడీపీ మడకశిర అభ్యర్థిగా ప్రకటించడంతో... తామంతా మండలంలో ప్రచారం చేస్తున్నామన్నారు. ఉన్నట్టుండి నాన్‌లోకల్ వ్యక్తి ఎంఎస్.రాజుకు చంద్రబాబు బీఫాం ఇవ్వడం అన్యాయమన్నారు.



అమరాపురం బస్టాండులో చంద్రబాబు, లోకేష్‌ల ఫెక్సీలను తగులబెడుతున్న దృశ్యం

కన్నీళ్లు పెట్టుకున్న ఈరన్న.. !

ఎంఎస్ రాజుకు పార్టీ అధినేత చంద్రబాబు బీఫాం ఇవ్వగానే మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఆయన కుమారుడు సునీల్ కుమార్ గుడిబండ సమీపంలోని ఓ తోటలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. చంద్రబాబు నమ్మించి మోసం చేశారని ఈరన్న ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆర్థికంగా కూడా నష్టపోయానని వాపోయినట్లు సమాచారం. చంద్రబాబు తనకు తీవ్ర అన్యాయం చేశారని కార్యకర్తల మధ్య కన్నీళ్లు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తన కుమారుడికి టికెట్ రాకుండా అడ్డుకున్న నాయకులకు బుద్ధి చెప్పడానికి అండగా నిలబడాలని కోరినట్లు సమాచారం. ముఖ్యంగా మడకశిరలో టీడీపీని ఓడించి చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పడమే తన ధ్యేయమని కార్యకర్తలతో ఈరన్న అన్నట్లు తెలుస్తోంది.



గుడిబండ సమీపంలోని ఓతోటలో నిర్వహించిన సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

రెబల్‌గా పోటీ?..

టీడీపీ రెబల్‌గా పోటీ చేయాలని, తామంతా అండగా నిలబడతామని ఐదు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈరన్నకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఈరన్న లేదా అతని కుమారుడు సునీల్ ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమయ్యారు. రేపోమాపో ఈరన్న కూడా నామినేషన్ వేయనున్నారు.

బాలకృష్ణ అనుచరులపై కేసు

- ఎమ్మెల్యే అభ్యర్థిపై కేసు కట్టకపోవడంపై విమర్శలు



ఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో టీడీపీ నాయకులు(ఫైల్)

సాక్షి ఎఫెక్ట్..

హిందూపురం అర్బన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 19న బాలకృష్ణ నామినేషన్ సందర్భంగా ఆయన, తన అనుచరులతో కలిసి హడావుడి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాలకృష్ణ తన సతీమణి వసుంధరతో పాటు టీడీపీకి చెందిన మరో 18 మందితో కలిసి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు వెళ్లారు. 15 మంది టీడీపీ కార్యకర్తలు ఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో ఉండగా..బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధర, మరో ముగ్గురు టీడీపీ నాయకులు ఆర్‌ఓ కార్యాలయంలోనికి వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించిన విషయం తెలిసిందే. అలాగే నామినేషన్ తర్వాత కూడా ఆర్‌ఓ కార్యాలయం వద్దే బాలకృష్ణ దంపతులు ఫొటోలకు ఫోజులిచ్చారు. ఆర్‌ఓ కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకూ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్న నిబంధనలు ఉల్లంఘించి బాలకృష్ణ ఆర్‌ఓ కార్యాలయం సమీపంలోనే మీడియాతో మాట్లాడారు. అయినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. దీనిపై పలువురు స్థానికులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. పత్రికల్లో వచ్చిన ఫొటోలు, ప్రసార మాధ్యమాల్లో టెలికాస్ట్ అయిన వీడియోల ఆధారంగా బాలకృష్ణ అనుచరులు 15 మందిపై సెక్షన్ 188 ఐపీసీ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ హారున్ బాషా తెలిపారు. అయితే కోడ్ ఉల్లంఘించిన టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ, ఆయన సతీమణి వసుంధరను పక్కనపెట్టి కేవలం టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా హీరో అయితే ఎన్నికల కోడ్ ఉల్లంఘించవచ్చా..? అని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. మరి దీనికి హిందూపురం ఎన్నికల అధికారి ఏం సమాధానం చెబుతారో చూడాలి.

కదిరిలో హ్యాట్రిక్ కొడతాం



కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వనం గంగిరెడ్డి

- వైఎస్సార్‌సీపీలో చేరిన వనం గంగిరెడ్డి
- కుమారుడితో కలిసి పార్టీలో చేరిక
- కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించిన మక్బూల్

కదిరి: ఈ ఎన్నికల్లో కదిరిలో బి.ఎస్.మక్బూల్ అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించి వైఎస్సార్ సీపీ తరపున హ్యాట్రిక్ కొడతామని రెస్కో మాజీ చైర్మన్ వనం గంగిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన కుమారుడు సాయివర్ధన్‌రెడ్డితో కలిసి టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బి.ఎస్.మక్బూల్ అహ్మద్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వనం గంగిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు కుల,మతాల కతీతంగా, పార్టీలకతీతంగా అర్హులందరికీ అందుతున్నాయన్నారు. బాబు పాలనలో అర్హత ఉన్నప్పటికీ జన్మభూమి కమిటీ సభ్యులు చెబితే గానీ ఇల్లు, రేషన్ కార్డు, పింఛన్ ఇలాంటికి పేదలకు అందేవి కాదన్నారు. కరోనా సమయంలోనూ సీఎం జగన్ ప్రజలకు విశేష సేవలు అందించి దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. అందుకే జగన్ నాయకత్వంలో పని చేయాలనే కోరికతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వనం తెలియజేశారు.

విజయదుందుభి మోగిస్తాం..

అనంతరం మక్బూల్ మాట్లాడుతూ, ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని, జగనన్న పేదల పక్షాన ఉంటే చంద్రబాబు పెత్తందార్ల పక్షాన నిలిచారన్నారు. వలంటీర్ వ్యవస్థను విమర్శించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే వలంటీర్ల వేతనాలు పెంచుతానని చెప్పడానికి సిగ్గుగా లేదా? అని ప్రశ్నించారు. ఏ గ్రామానికి వెళ్లినా మళ్లీ జగనే రావాలి..అని కోరుకుంటున్నారని, ప్రజాభిమానంతో తప్పకుండా రానున్న ఎన్నికల్లో విజయదుందుభి మోగిస్తామన్నారు. జగనన్న నాయకత్వంలో పని చేసేందుకు కదిరి నియోజకవర్గంలోని మరికొంత మంది టీడీపీ నేతలు సిద్ధంగా ఉన్నారని, వారిని కూడా సాదరంగా ఆహ్వానిస్తామని మక్బూల్ చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, కదిరి అసెంబ్లీ ఎలక్షన్ ఇన్‌చార్జ్ పూల శ్రీనివాసరెడ్డి, గాండ్లపెంట మండల ఇన్‌చార్జ్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లోకేశ్వరరెడ్డి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీకి దెబ్బమీద దెబ్బ..

ఎన్నికల వేళ కదిరి నియోజకవర్గంలో టీడీపీకి దెబ్బ మీద దెబ్బ పడుతోంది. మొన్నటికి మొన్న టీడీపీకి చెందిన సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రవూఫ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నిన్నటికి నిన్న కదిరి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సురయాభాను టీడీపీకి రాజీనామా చేశారు. ఆమె భర్త బాబ్జాన్ సైతం టీడీపీ తెలుగు యువత జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసి కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తాజా వనం గంగిరెడ్డి కుమారుడితో కలిసి పార్టీలో చేరారు. ఇలా ముఖ్యనేతలంతా పార్టీకి గుడ్‌బై చెబుతుండగా తెలుగు తమ్ముళ్లంతా అయోమయంలో పడిపోయారు.

అంతా గందరగోళం

- నామినేషన్ల ఘట్టంలోనే 'తమ్ముళ్ల'లో టెన్షన్
- బీఫాం అందజేతతో పలు చోట్ల అయోమయం
- మడకశిరలో చంద్రబాబుపై ఆగ్రహజ్వాల
- పుట్టపర్తి టీడీపీ రెబల్‌గా దిగనున్న సిమెంట్ పోలన్న
- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తీరుపై వడ్డెర్ల ఆగ్రహం
- అచ్చెన్నాయుడుతో కలిసిన పరిపూర్ణానందస్వామి



సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల వేళ టీడీపీలో అంతా గందరగోళంగా మారింది. నామినేషన్ల తొలి ఘట్టంలోనే 'తమ్ముళ్లు' తలోదిక్కు చూస్తున్నారు. అధిష్టానం బీఫారం అందజేసిన క్రమంలో అక్కడక్కడా సీట్ల మార్పులతో జిల్లాలో కూడా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. జిల్లాలోని ఎస్సీ రిజర్వుడు సీటు మడకశిరలో అభ్యర్థి మార్పుతో హిందూపురం పార్లమెంటు వ్యాప్తంగా టీడీపీలో ఆగ్రహ జ్వాలలు రేగాయి. మడకశిరలో చంద్రబాబు దిష్టిబొమ్మలు దహనం చేశారు. 'నాన్ లోకల్ నాయకులు వద్దు.. లోకల్ లీడర్స్ ముద్దు' అంటూ తెలుగు 'తమ్ముళ్లు' నినాదాలు చేశారు. పుట్టపర్తిలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న వడ్డెర్లు అడ్డం తిరిగారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులకే టికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. మొత్తంగా టీడీపీ వెంట నడిచేందుకు బడుగు, బలహీన వర్గాల నేతలు ఆసక్తి చూపడం లేదు. సామాన్యులను పట్టించుకోకుండా కేవలం పెత్తందార్లకే చంద్రబాబు పెత్తనం కడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యాన్ కిందకు కదిరి తమ్ముళ్లు..

బీజేపీతో టీడీపీ చేతులు కలిపిన వెంటనే చాలా మంది ముస్లిం మైనార్టీలు 'సైకిల్' దిగారు. తమ భవిష్యత్తు బాగుండాలంటే వైఎస్సార్‌సీపీలో చేరడమే సరైన మార్గమని భావించి 'ఫ్యాన్' కిందకు వచ్చారు. ఈక్రమంలోనే కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తాజాగా రెస్కో మాజీ చైర్మన్ వనం గంగిరెడ్డి టీడీపీకి గుడ్‌బై చెప్పారు. కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరి దారిలోనే పలువురు టీడీపీ నేతలు త్వరలోనే వైఎస్సార్ సీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది.

పుట్టపర్తిలో బీసీల ఆగ్రహం..

జిల్లా కేంద్రం పుట్టపర్తిలో టీడీపీపై బీసీలు గుర్రుగా ఉన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తమను గుర్తించడం లేదని.. చంద్రబాబు – నారా లోకేశ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా.. ఫలితం లేదని సిమెంట్ పోలన్న మీడియా ముందుకు వచ్చారు. పుట్టపర్తి నుంచి టీడీపీ రెబల్‌గా పోటీ చేస్తానని ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పుట్టపర్తిలో అత్యధిక ఓటు బ్యాంకు ఉన్న వడ్డెర్లలో చాలామంది ఇప్పటికే వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తున్నారు. రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్ మరికొందరు బీసీ నేతలు కూడా ఇటీవలే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పల్లె పెత్తనం నచ్చని గ్రామాలకు గ్రామాలే వచ్చి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నాయి.

అచ్చెన్నాయుడుతో పరిపూర్ణానంద భేటీ..

హిందూపురం ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డ ఆధ్యాత్మికవేత్త పరిపూర్ణానంద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో భేటీ అయినట్లు తెలిసింది. తనకు టికెట్ ఇవ్వకపోతే హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ఇప్పటికే ఆయన హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో పరిపూర్ణానంద టీడీపీ పెద్దలతో భేటీ కావడంతో స్థానిక టీడీపీ నేతలకు భయం పట్టుకుంది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది. పలువురు కీలక నేతలు వైఎస్సార్ సీపీలో చేరుతుండగా ఏం చేయాలో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు.

ఆదరణ అపూర్వం

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఏ గ్రామానికి వెళ్లినా అపూర్వ ఆదరణ లభిస్తోంది. జగనన్న జనరంజక పాలన మళ్లీ కావాలని జనం చెబుతున్నారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు.



ప్రచారంలో భాగంగా రొద్దంలో ఓ వృద్ధునితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మంత్రి, పెనుకొండ అభ్యర్థి ఉషశ్రీ చరణ్



వైఎస్సార్‌సీపీలో చేరిన బుక్కపట్నం, గూనిపల్లి, పాముదుర్తి వాసులతో వైఎస్సార్ సీపీ పుట్టపర్తి అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



చిలమత్తూరు మండలం సోమఘట్టలో ఎన్నికల ప్రచారంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులు దీపిక, శాంతమ్మ

క్లుప్తంగా

ఐబీఆర్ అచీవర్‌గా రాప్తాడు బుడ్డోడు



రేయాన్స్ ప్రభు

రాప్తాడు: అసాధారణ ప్రతిభతో రాప్తాడుకు చెందిన బుడతడు (మూడు సంవత్సరాల 11 నెలల వయసు) రేయాన్స్ ప్రభు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఐబీఆర్)లో చోటు దక్కించుకున్నాడు. రాప్తాడు పంచాయతీ పరిధిలోని చిన్మయనగర్‌కు చెందిన వినయ్‌కుమార్, కల్పన దంపతుల ప్రథమ కుమారుడు ఎస్.రేయాన్స్ ప్రభు స్క్రీన్‌పై ప్రదర్శించిన లోగోలను చూస్తూ అవి ఏ కంపెనీకి చెందిన కార్లో గుర్తించాడు. ఇలా 20 కంపెనీల లోగోలను గుర్తించడాన్ని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అభినందిస్తూ ఈ ఏడాది మార్చి 6న ఐబీఆర్ అచీవర్‌గా ప్రకటించారు. ఐబీఆర్ అప్రియేషన్ సర్టిఫికెట్, గోల్డ్ మెడల్, ఐబీఆర్ బుక్, ఐడీ, పెన్, షీల్డ్, రెండు స్టిక్కర్లను బహూకరించారు. చిన్న వయస్సులోనే చిన్నారికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం దక్కడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

స్తంభాన్ని ఢీకొన్న బైక్

- యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన చేతన్


అపస్మారకస్థితిలోకి వెళ్లిన అప్పు

రొళ్ల: ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం మధుగిరిలో ఓ ఫైనాన్స్ వెహికల్ సీజింగ్ కంపెనీ ఉద్యోగి అయిన చేతన్ (29) ఆదివారం మధ్యాహ్నం అప్పు అనే యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై హొసకెర మీదుగా రొళ్లకు వస్తున్నారు. మార్గం మధ్యలోని రత్నగిరి పంచాయతీ ఆర్.రంగాపురం గేట్ వద్ద వీరి ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో చేతన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పు తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. సమాచారం అందుకున్న బంధువులు, స్నేహితులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని ప్రైవేట్ వాహనంలో తమకూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పు ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న రొళ్ల, కర్ణాటక రాష్ట్రం మిడిగేశి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రుణమాఫీ.. అక్కచెల్లెమ్మల హ్యాపీ

అక్కచెల్లెమ్మలు బ్యాంకుల ద్వారా తీసుకున్న డ్వాక్రా రుణాలు ప్రస్తుత ప్రభుత్వంలో పూర్తిగా మాఫీ కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో రుణమాఫీ హామీ ఇచ్చిన పార్టీ అధినేతను నమ్మిన అక్కచెల్లెమ్మలు కంతులు చెల్లించకపోవడంతో వడ్డీలతో అప్పు చాంతాడంత పేరుకుపోయి బ్యాంకర్ల దృష్టిలో డిఫాల్టర్లుగా ముద్రపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వంలో బ్యాంకర్లకు అత్యంత నమ్మకస్తులుగా పొదుపు సంఘాలు మారాయి. ప్రభుత్వమందించిన ప్రోత్సాహమే ఇందుకు కారణం.

- నాలుగు విడతలుగా సాయం
- హామీ నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం
- నాలుగేళ్లలో రూ.863.66 కోట్ల పంపిణీ



పుట్టపర్తి అర్బన్: స్వయం సహాయక పొదుపు సంఘాలు (ఎస్‌హెచ్‌జీ/డ్వాక్రా) పరపతి పెరిగింది. సంఘాల్లో సభ్యులైన అక్కచెల్లెమ్మలు 2019 నుంచి 2024 వరకు ప్రభుత్వ సహకారంతో రుణాలు తీసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకుంటూ సకాలంలో బ్యాంకులకు కంతులు చెల్లిస్తూ వచ్చారు. గతంలో పడ్డ డిఫాల్టర్ ముద్ర తొలగిపోయి.. బ్యాంకర్ల దృష్టిలో నమ్మకం పెంపొందించుకున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతో దోహదపడింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద 2020 సెప్టెంబర్ 11న మొదటి విడతలో జిల్లాలోని 2,7941 సంఘాలకు రూ.214.37 కోట్లు లబ్ధి చేకూరింది. రెండో విడతలో 2021 అక్టోబర్ 7న 28,071 సంఘాలకు రూ.217.11 కోట్ల లబ్ధి చేకూరింది. మూడో విడత 2023 మార్చి 25న 28,127 సంఘాలకు రూ.216.55 కోట్లు, ఇక నాలుగో విడతలో 28,127 సంఘాలలోని సభ్యులైన 2,77,571 మంది మహిళలకు రూ.215.63 కోట్లు ఇలా నాలుగేళ్లలో రూ.863.66 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రభుత్వం అందించిన సహాయాన్ని మహిళలు ఉపయోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతున్నారు.

వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా రుణాల మాఫీ ఇలా..

విడత	సంఘాలు	లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి విడత	27,941	214.37
రెండవ విడత	28,071	217.11
మూడవ విడత	28,127	216.55
నాల్గవ విడత	28,127	215.63

రూ.5 లక్షలు మాఫీ అయింది



వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మా పొదుపు సంఘానికి రూ.5 లక్షల అప్పు మాఫీ అయ్యింది. 13 మంది సభ్యులు ఉన్న మా సంఘంలో ఒక్కో సభ్యురాలికి రూ.38,500 వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. అంతేకాదు సున్నా వడ్డీ, స్త్రీనిధి రుణాలు, ఉన్నతి రుణాలతో ఆదుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం అమలు చేసింది.
– లక్ష్మమ్మ, దొమ్మరహట్టి, రొళ్ల మండలం

ఆర్థికంగా నిలదొక్కుకున్నా



గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేసింది. నాకు వైఎస్సార్ ఆసరా కింద రూ.70 వేలు, చేయూత పథకం కింద రూ.75వేలు అందింది. ఈ డబ్బుతో 50 గొర్రెలు కొని పెంచుతున్నా. నెలకు రూ.25 వేలు ఆదాయం వస్తోంది. మహిళా లోకానికి అండగా నిలిచిన ప్రభుత్వానికి మా మద్దతు ఉంటుంది.
– జయమ్మ, సోమరాజుకుంట, ముదిగుబ్బ

ఇంతకంటే ఇంకేం కావాలి..?



నాకు ఈ ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి రూ.1.07 లక్షలు అందింది. బ్యాంకు నుంచి రూ.50 వేలు రుణం తీసుకొని కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకున్నాను. దీంతో నెలకు రూ.20 వేలకు పైగా సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మా కుటుంబానికి రైతు భరోసా, అమ్మ ఒడి, పెన్షన్ పథకాలు కూడా అందుతున్నాయి. చాలా సంతోషంగా ఉంది. ఇంతకంటే మాకు ఇంకేమి కావాలి..? – సావిత్రమ్మ, పోతులనాగేపల్లి, ధర్మవరం

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

- 33 విభాగాలకు అవకాశం
- 12డీ ఫాంతో పోస్టల్ బ్యాలెట్
- రైల్వే ఉద్యోగులకు ఈసారి నుంచే..

హిందూపురం అర్బన్: ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే. ఒక్కోసారి అభ్యర్థుల తలరాత మారుస్తుంది. అందుకే ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ ఎంతో ప్రాధాన్యం ఉంది. మే 13న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. మామూలుగా పోలింగ్ రోజున ఓటర్లు తమ ఓటును పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వేయడం మామూలే. అయితే అత్యవసర (ఎమర్జెన్సీ) విధుల్లో పనిచేసే కొంతమంది ఉద్యోగులు ఆ విధంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయడం కుదరదు. అటువంటి వారి కోసమే పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టింది. ఈ సారి 33 అత్యవసర సేవా విభాగాల్లో పని చేస్తున్న వారిని గుర్తించి వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించింది. పోస్టల్ ఓటు కావాలనుకొనేవారు గడువులోగా నమోదు చేసుకోవాలి. దీనికి సంబంధించి ఫారం 12డీ అందుబాటులో ఉంచాలని ఎన్నికల అధికారులను ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

ఎవరెవరికంటే..

ప్రయాణికులను తరలించే రైల్వే, గూడ్స్, మెట్రో, రవాణాసేవలు, విద్యుత్, పోస్టల్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్లు, పాల సహకార సంఘాలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఫైర్, ఆర్టీసీ, పోలీస్, అంబులెన్స్, షిప్పింగ్, ఎక్సైజ్, జైళ్లు, వాటర్ అథారిటీ, అటవీ, పౌర రక్షణ, ట్రెజరీ, హోమ్‌గార్డులు, ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, పీడబ్ల్యూడీ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్లు, విద్యుత్ నిర్వహణ, విపత్తు నిర్వహణ, సమాచార పౌర సంబంధాల శాఖ, పోలింగ్ రోజు వార్తలు కవర్ చేసే మీడియా ప్రతినిధులు (ఎన్నికల కమిషన్ జారీ చేసిన లేఖలతో), ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు సంబంధించిన వారంతా పోస్టల్ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చు.

తొలి సారిగా రైల్వే ఉద్యోగులకు..

అత్యవసర విభాగాల వారి మాదిరిగానే తమకూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలని రైల్వే ఉద్యోగులు చాలాకాలంగా కోరుతున్నారు. వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల కమిషన్ తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించేందుకు పచ్చ జెండా ఊపింది. ఉమ్మడి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా రైల్వే డివిజన్ గుంతకల్లుతో పాటు అనంతపురం, ధర్మవరం, గుత్తి, హిందూపురం, ధర్మవరం, చిన్న స్టేషన్లలో 3 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో నిత్యం వెయ్యి మంది వరకు లోకో పైలెట్, అసిస్టెంట్ లోకో పైలెట్, గార్డులు, టీటీఈలతో పాటు రన్నింగ్ స్టాఫ్ ఉంటారు. ఇక స్టేషన్ మాస్టర్లు, ప్రధానంగా గేట్‌మెన్‌లు ఉంటారు. వీరికి పోలింగ్ రోజున బూత్‌లోకి వెళ్లి ఓటు వేయలేని పరిస్థితి. ఈసారి పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

అక్షర క్రమంలోనే.. గుర్తులు


ఎన్నికల గుర్తులు


ఈవీఎం బ్యాలెట్ పేపర్‌లో గుర్తులు

- గుర్తింపు పొందిన పార్టీలకు రిజర్వుడు గుర్తు
- రిజిస్టర్‌రై గుర్తింపు పొందని పార్టీలకూ రిజర్వుడు గుర్తు
- స్వతంత్ర అభ్యర్థులకు కోరుకున్న మూడింట్లో ఒకటి కేటాయింపు

అనంతపురం అర్బన్: సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ వారికి ఆ గుర్తు కేటాయిస్తారు. స్వతంత్రులకు మాత్రం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన గుర్తులను అభ్యర్థుల పేరును బట్టి అక్షర క్రమంలో (తెలుగులో) కేటాయించనున్నారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ తర్వాత రంగంలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం కేటాయించే గుర్తులతో వారు ప్రచారం చేసుకోవాలి. రాష్ట్ర ఎన్నికల సంఘం కొన్ని గుర్తులను ఎంపిక చేసి ఇప్పటికే జిల్లాకు పంపింది.

గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు..

రిజర్వుడు గుర్తులు ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఆ గుర్తులనే కేటాయిస్తారు. అలాగే రిజిస్టర్‌రై గుర్తింపులేని రాజకీయపార్టీల అభ్యర్థులకు సైతం కేటాయించిన గుర్తులపైనే పోటీ చేసే అవకాశం కల్పిస్తారు. అయితే పోటీలో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థులు ఫారం-ఎ, ఫారం-బి సమర్పించి ఉండాలి. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు నామినేషన్ పత్రంలో మూడు గుర్తులు కోరాల్సిన అవసరం లేదు. అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారో ఆ పార్టీ గుర్తునే వారు తప్పకుండా పేర్కొనాలి.

స్వతంత్ర అభ్యర్థికి ప్రత్యేకం..

స్వతంత్ర అభ్యర్థి తన మొదటి నామినేషన్ పత్రంలో పేర్కొన్న మూడు గుర్తుల్లో ఒకదానిని మాత్రమే కేటాయిస్తారు. ఒక వేళ మొదటి నామినేషన్ పరిశీలనలో తిరస్కరించినప్పటికీ, ఆ తరువాత ఇచ్చిన నామినేషన్ సెట్‌లో వేరే గుర్తులు పేర్కొన్నా... ఆ నామినేషన్ ఆమోదం పొందినప్పటికీ, మొదట ఇచ్చిన నామినేషన్‌లో పేర్కొన్న గుర్తుల్లో ఒకదానినే కేటాయిస్తారు.

ఒకరికి కేటాయిస్తే...

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల్లో ఒకరికి కేటాయించిన గుర్తును మరొక అభ్యర్థికి అదే నియోజకవర్గంలో కేటాయించరు. కొన్ని సందర్భాల్లో రిజిస్టర్‌రై గుర్తింపులేని పార్టీలకు గుర్తులు కేటాయింపు కాకపోతే, అలాంటి క్రమంలో వారు ఫ్రీ గుర్తులు నుంచి మూడు గుర్తులు కోరుకోవచ్చు. వాటిలో నుంచి ఒకదానిని కేటాయిస్తారు. ఆ గుర్తును స్వతంత్ర అభ్యర్థికి ఇవ్వరు. ఎవరైనా అభ్యర్థి గతంలో స్వతంత్ర అభ్యర్థిగా ఒక ఫ్రీ గుర్తుతో పోటీ చేసి ఉండి... తాజాగా మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేస్తుంటే అతను నామినేషన్‌లో గతంలో తాను పోటీ చేసిన ఫ్రీ గుర్తును తిరిగి కోరితే అదే కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారిలో పలువురు ఒకే గుర్తును కోరుకుంటే లాటరీ పద్ధతిలో ఆ గుర్తును కేటాయిస్తారు.

పొత్తులు పెట్టుకుని ఉంటే...

కొన్ని రాజకీయ పార్టీలు పొత్తులు పెట్టుకుని ఉంటాయి. ఇలాంటి సందర్భంలో ఏ పార్టీ పోటీలో ఉంటే ఆ పార్టీ గుర్తునే ఎన్నికలకు ఉపయోగించాలి. ఒక సందర్భంలో ఏదైనా రిజిస్టర్‌రై గుర్తింపు ఉన్న లేక రిజిస్టర్‌రై గుర్తింపు లేని పార్టీ అభ్యర్థులు నామినేషన్ వేస్తారు. నామినేషన్ గడువు చివరి తేదీలోపు ఫారం-ఎ, ఫారం-బి ఇవ్వకపోతే వారు పదిమంది ప్రతిపాదకులతో నామినేషన్ ఇచ్చి ఉంటే వారికి ఫ్రీ గుర్తు కేటాయిస్తారు.

విద్యార్థి ఆత్మహత్య

తనకల్లు: చీకటిమానిపల్లిలో భరణి (14) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. భరణి చీకటిమానిపల్లిలో అమ్మమ్మ రామక్క దగ్గర ఉంటూ కదిరిలోని ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొంతసేపటి తర్వాత గమనించిన స్థానికులు అతడిని వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే భరణి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

గొంతు కోసుకున్న ప్రేమ జంట


- బంధువుల మందలింపుతో అఘాయిత్యం
- ఆస్పత్రిలో కోలుకుంటున్న బాధితులు



గొంతు కోసుకున్న దుర్గమ్మ అలియాస్ పల్లవి, బాబు

అమరాపురం: బంధువుల మందలింపుతో మనస్తాపం చెందిన ఓ ప్రేమ జంట గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో వైద్య సేవలందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. బాధితుల బంధువులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పి.శివరం గ్రామానికి చెందిన వివాహిత దుర్గమ్మ అలియాస్ పల్లవికి భర్త తరపు బంధువైన మద్దనకుంటకు చెందిన అవివాహితుడైన బాబు మధ్య పరిచయం ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం వీరిద్దరూ ఇంటి నుంచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఇరు కుటుంబాల వారూ వెదుకుతున్నారు. ఎట్టకేలకు జాడ గుర్తించి వీరిద్దరినీ ఉప్పార్లపల్లిలోని బంధువుల ఇంటికి తీసుకొచ్చారు. ఐదేళ్ల కుమారుడు కలిగిన వివాహితను ఇలా తీసుకెళ్లడం తప్పని.. ఇది సరైనది కాదని మందలించారు. పద్ధతి మార్చుకుని ఎవరిళ్లకు వారు వెళ్లి బుద్ధిగా జీవించాలని సూచించారు. తామిద్దరూ ఆలోచించి నిర్ణయం చెబుతామని సమీపంలోని చెట్టుకిందకు వెళ్లిన ఇద్దరూ షేవింగ్ బ్లేడ్‌తో గొంతు కోసుకున్నారు. దీన్ని గమనించిన బంధువులు వెంటనే 108 సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమందించారు. కొద్దిసేపటికి అక్కడకు చేరుకున్న 108 వాహనంలో దుర్గమ్మ అలియాస్ పల్లవి, బాబుకు ప్రథమ చికిత్స చేసిన అనంతరం.. మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి


నాగరాజు (ఫైల్)

చిలమత్తూరు: కొడికొండ పంచాయతీ కార్యదర్శి నాగరాజు (46) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కదిరికి చెందిన నాగరాజు చిలమత్తూరులో నివాసముంటూ కొడికొండ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం రాత్రి చేయి విపరీతంగా లాగుతుండటంతో మరొకరి సాహాయంతో ఆస్పత్రికి కారులో బయల్దేరారు. లేపాక్షి వద్దకు వెళ్లగానే ఛాతీలో నొప్పిగా ఉందని విలవిలలాడారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగరాజు శెట్టిపల్లి, దేమకేతేపల్లి, టేకులోడు పంచాయతీల్లోనూ పనిచేశారు. కార్యదర్శి మృతి పట్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి టీఎన్ దీపిక, తహసీల్దార్ భాగ్యలత, ఎంపీడీఓ రామ్‌కుమార్, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారెడ్డి, దేమకేతేపల్లి సర్పంచ్ తిరుమలేష్, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


27 నుంచి మూఢం ఆరంభం

- శుభ కార్యాలకు 3 నెలలు ఆగాల్సిందే

హిందూపురం అర్బన్: మూఢం (మౌఢ్యం) వచ్చేస్తోంది. మంచి ముహూర్తాల కోసం ఏప్రిల్ 27 తర్వాత నుంచి మూడు నెలలపాటు ఆగాల్సిందే. మధ్యలో ఒకటి రెండు ముహూర్తాలు ఉన్నాయి. మూఢం అంటే చీకటి. అశుభ కాలం. జ్యోతిష్యకాలం ప్రకారం నవగ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతుంటాయి. భూమి, సూర్యుడు ఒక గ్రహానికి ఒకే వరుసలో ఉన్నప్పుడు ఆ గ్రహం భూమి మీద ఉన్న వారికి కనపడదు దీనినే మూఢం లేదా అస్తంగత్వం అంటారు. గ్రహాలకు రాజు సూర్యుడు. సూర్యునికి సమీపంలో వెళ్లే గ్రహం ఏదైనా సరే తన శక్తిని కోల్పోతుంది. గురు గ్రహం సూర్యుడికి దగ్గరగా వస్తే గురు మౌఢ్యమి, శుక్రుడు సూర్యుడు దగ్గరగా వస్తే శుక్ర మౌఢ్యమి వస్తుంది. మూఢం వస్తే శుభకార్యాలకు దూరంగా ఉండాలని పండితులు చెబుతారు. గురు, శుక్ర గ్రహాలు శుభ గ్రహాలు. మూఢం వస్తే ఎలాంటి శుభ కార్యాలూ చేయరాదంటారు. అలా చేస్తే నష్టం కలుగుతుందంటారు.

శుక్ర మౌఢ్యమి ఎప్పుడంటే..

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం బహుళ చవితి ఏప్రిల్ 27 శనివారం తెల్లవారు జాము 4.40 గంటలకు శుక్ర మూఢం ప్రారంభమై ఉత్తరాయణం, గ్రీష్మ రుతువు ఆషాఢ మాసం, శుక్ల విదియ ఆదివారం జూలై 7వ తేదీ తెల్లవారుజాము 4 గంటలకు ముగుస్తుంది.


సూర్య గ్రహం చుట్టూ గ్రహాల పనితీరు

మొత్తం 73 రోజులు మూఢం ఉంటుంది.

గురు మౌఢ్యమి ఎప్పుడంటే..

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్రమాసం బహుళ చైత్రమాసం మే 7న (మంగళవారం) పగలు 1.30 గంటలకు గురు మౌఢ్యమి మొదలై వసంతరుతువు వైశాఖ మాసం బహుళ ఏకాదశి జూన్ 2 (ఆదివారం) తెల్లవారు జాము 2.30 గంటల వరకు ఉంటుంది. 27 రోజుల పాటు గురు మౌఢ్యమి ఉంటుంది.

మూఢంలో చేయ కూడని పనులు..

మూఢంలో శుభ గ్రహాలు బలహీనంగా ఉంటాయి కనుక వివాహాది శుభ కార్యాలు చేయరాదని పండితులు చెబుతారు. ప్రధానంగా లగ్న పత్రికలు రాసుకోవడం, వివాహానికి సంబంధించిన విషయాలు మాట్లాడటం, ఉపనయనాలు చేయరాదు. పుట్టు వెంట్రుకలు తీయరాదని, నూతన గృహ ప్రవేశాలు చేయడం, శంకు స్థాపనలు చేయడం, విగ్రహ ప్రతిష్ఠలు, వ్రతాలు వంటివి చేయరాదు. నూతన వధువు అత్తారింటికి వెళ్లకూడదు. ముక్కుపుడకలు కుట్టించుకోవడం చేయరాదు. బావులు, చెరువులు తవ్వరాదు. ఉపనయనాలు వేయరాదు. ఇళ్లు మారడం చేయరాదు.

మూఢంలో చేసుకోదగ్గవి..

అన్నప్రాసన చేయవచ్చు. ప్రయాణాలు చేయవచ్చు. ఇంటి మరమ్మతులు చేసుకోవచ్చు. భూములు అమ్మటం, కొనటం చేసుకోవచ్చు, అగ్రిమెంట్లు చేసుకోవచ్చు. ఉద్యోగాల్లో చేరడం, విదేశీ విద్యకు వెళ్లడం చేయవచ్చు. నూతన వాహనాలు కొనవచ్చు (వారి జన్మ నామ నక్షత్రం ప్రకారం చూసి కొనాలి). జాతకాలు రాయించుకోవడం, నవగ్రహ శాంతులు, సీమంతం, నామకరణాలు, హోమాలు, గుండన క్షత్ర శాంతులు, జపం, ఉత్సవాలు, బట్టలు కొనడం చేయవచ్చు.

3 నెలల తర్వాతే శుభకార్యాలు



మూఢం కారణంగా మూడు నెలల పాటు ఒకటి రెండు ముహూర్తాలు మినహా శుభ కార్యములు చేసుకునేందుకు అవకాశం లేదు. జూన్ 24, 26లో రెండు ముహూర్తాలు మాత్రం ఉన్నాయి. మొత్తంగా చూస్తే శుభకార్యాలు మూడు నెలల పాటు లేనట్టే.
– అనంతరామశర్మ, పండితులు, హిందూపురం

డిపాజిట్ తిరిగి పొందవచ్చు



హిందూపురం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల సమయంలో కొద్ది మొత్తాన్ని డిపాజిట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అయితే పోలింగ్ అనంతరం నిర్దిష్టమైన ఓట్లు రాకపోతే డిపాజిట్ గల్లంతై పోతుంది. ఓటమి పాలైన అభ్యర్థికి డిపాజిట్ వాపసు చెల్లించరు. నామినేషన్లలో ఏవైనా తప్పిదాలు ఉంటే పరిశీలన సమయంలో అధికారులు గుర్తించి ఆ నామినేషన్‌ను తిరస్కరిస్తారు. ఇలాంటి అభ్యర్థులు డిపాజిట్ వెనక్కు చెల్లిస్తారు కానీ, ఎన్నికలు ముగిసే వరకూ సదరు అభ్యర్థి ఎదురు చూడాల్సి ఉంటుంది. నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే మాత్రం వెంటనే డిపాజిట్ వెనక్కు చెల్లిస్తారు.

ప్రవర్తన నియమావళి అందరికీ వర్తిస్తుంది

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్- ఎంసీసీ) రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు మాత్రమే కాదు అందరికీ వర్తిస్తుంది. నియమావళి పాటించే విషయంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రభుత్వం అంటే ఉద్యోగులు... ఉద్యోగులంటే ప్రభుత్వం. కాబట్టి ఎన్నికల సమయంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది. మీడియాతో మాట్లాడే క్రమంలో ముఖ్యంగా రాజకీయ అజెండాతో పని చేసే కొన్ని మీడియా సంస్థల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. అవి తమ స్వార్థం కోసం ఉద్యోగులను వాడుకుంటాయి. ప్రభుత్వం మీద ఉద్యోగుల్లో ఉండే చిన్నపాటి అసంతృప్తిని కూడా తమకు అనుకూలంగా మలుచుకుంటాయి. వారి ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు ఇప్పిస్తూ తాము కోరుకున్న రీతిలోనూ పని చక్కబెట్టుకుంటాయి. చివరకు ఈ వ్యవహారంలో చిక్కులు తెచ్చుకుని నష్టపోయేది ఉద్యోగులే కావడం గమనార్హం.

రెండూ నియమావళి ఉల్లంఘనే..

ఎన్నికల సమయంలో ఉద్యోగులు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడడం, ప్రభుత్వానికి లబ్ధి చేకూర్చే విధంగానూ వ్యవహరించడమూ నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుంది. ఇక రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించడం, పార్టీల ప్రచారంలో పాల్గొనడం నియమావళి ఉల్లంఘనే అవుతుంది. రెగ్యులర్ ఉద్యోగులకే కాదు ప్రభుత్వం ద్వారా గౌరవ వేతనం, కనీస వేతనం పొందుతున్న వారికీ ప్రవర్తన నియమావళి వర్తిస్తుంది.

వృద్ధుడి మృతి


మృతి చెందిన వ్యక్తి

బత్తలపల్లి: మాల్యవంతం సమీపంలోని కాశీరెడ్డినాయన ఆశ్రమం వద్ద ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు మూడు రోజుల కిందట కాశీరెడ్డి నాయన ఆశ్రమం వద్దకు వచ్చారు. తన పేరు సుంకన్న (60) అని పరిచయం చేసుకున్నారు. పూర్తి వివరాలు ఏవీ తెలపలేదు. శనివారం రాత్రి ఆశ్రమం వద్దే నిద్రించాడు. కాసేపటి తర్వాత ఆయనలో ఉలుకూ పలుకూ లేకపోవడంతో ఆశ్రమం వద్దనున్నవారు నిద్రలేపడానికి ప్రయత్నించారు. లేవకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారమందించారు. ప్రస్తుతం మృతదేహాన్ని ఆర్డీటీ ఆస్పత్రిలో ఉంచారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని బత్తలపల్లి పోలీసులు కోరారు.

యువకుడి బలవన్మరణం


మృతుడు ఉస్మాన్

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గిర్రాజుకాలనీకి చెందిన ఉస్మాన్ (25) బజాజ్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్నాడు. ఏమైందో తెలియదు కానీ ఆదివారం ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య షంషాద్, ఒక కుమారుడు ఉన్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.